క్లుప్తంగా

ఆలోచింపజేసిన కళాజాత



నందిగామ: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య, రవితేజ కళాకారుల బృందం సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను, మొక్కలు పెంచడం వలన కలిగే లాభాలను, ప్రతి మనిషి సంతోషంగా జీవించాలంటే పాటించవలసిన పద్ధతులపై కళాకారులు ప్రజలకు వివరించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కళాజాతాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్లు కళాకారులు తెలిపారు. మన భావితరాల వారు కూడా సంతోషంగా జీవించాలంటే కచ్చితంగా పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

నేడు పర్యావరణ దినోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ సీహెచ్‌మల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఉదయం 7.30 గంటలకు పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొననున్నారని తెలిపారు. వివిధ ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు హాజరుకావాలని కోరారు.

ముగిసిన నాట్య శిక్షణ శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: వేసవి సెలవుల్లో విద్యార్థులకు శాస్త్రీయ నృత్యం పట్ల ఆసక్తి పెంపొందించాలనే సదుద్దేశంతో వైవై కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీసాయి నటరాజ కూచిపూడి నాట్యాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నాట్యాలయం శిక్షకురాలు వలివేటి భారతీదేవి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. మూషిక వాహన గణపతి ప్రార్థన, బ్రాహ్మాంజలి, అదిగో అల్లదిగో, పుష్పాంజలి, జతిస్వర, సిరుత నవ్వుల వాడు కూచిపూడి నాట్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు పర్చా లక్ష్మణరావు విద్యార్థులకు నటరాజ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు వీఆర్‌వో చంద్రశేఖర్, సుప్రియ, అనురాధ, గార్లపాటి వాసు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం రెండో రోజు వేదస్వస్తి, గవ్యాంత పూజలు, మార్జనలతో ప్రారంభమై నిత్యబలిహరణలు నీరాజన మంత్ర పుష్పాలతో నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. శివకేశవ ఆలయ అభివృద్ధి కమిటీ భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించింది. యాగశాలలో దంపతులు వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య విశేష పూజలు చేశారు. హోమాలు, పూజలు, మంత్రాలతో ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కళావేదికపై పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషం ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన హనుమాన్ నృత్య కళా నిలయానికి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరగగా, భక్తులు ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సైనిక బోర్డు డైరెక్టర్ వెంకటరెడ్డి చెప్పారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ (నెక్సా) ప్రథమ వార్షికోత్సవ సమ్మేళనం ఘనంగా జరిగింది. వెంకటరెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి సంఘాలు ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సైనిక వెల్ఫేర్ భవనం నిర్మాణానికి స్థల సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. సైనిక బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ రాజారావు మాట్లాడుతూ పెన్షన్ పొందుతున్న మాజీ సైనికులు వారి భార్యల పేర్లను నమోదు చేయాలని కోరారు.

చెరువు మట్టితో.. చేనుకు చేవ

- చౌడు విరిగిపోయి భూములు సారవంతం
- అధిక దిగుబడికి దోహదం
- ఆసక్తి చూపుతున్న రైతులు



వత్సవాయిలోని బీడు భూముల్లో తోలిన నల్లమట్టి

వత్సవాయి: రైతులు పోటీలుపడి విచ్చలవిడిగా పురుగుమందులు వాడుతున్నారు. దీంతో భూముల్లో సారం పోయి దిగుబడులు గణనీయంగా తగ్గడంతోపాటు పెట్టుబడులు కూడా అధికం అవుతున్నాయి. పంట పొలాలకు సేంద్రియ ఎరువులను అందించకపోవడంతో క్రమేపీ అవి పంటలకు అనుకూలించడం లేదు. మొక్క సరిగా ఎదుగుదల లేకుండా పోతుంది. దీంతో రైతులు ఇటీవల కాలంలో కొంత సేంద్రియం వైపు మొగ్గు చూపుతున్నారు. దీనితోపాటు చెరువుల్లోని పూడికమట్టి, నల్లమట్టిని కూడా పొలాలకు తరలిస్తూ భూములను సారవంతం చేసుకుంటున్నారు. చెరువుమట్టి వల్ల భూమి సారవంతం కావడంతోపాటు పంట ఆశాజనకంగా పెరిగి దిగుబడులు పెరుగుతాయని రైతులు చెబుతున్నారు.

బీడుకు వరం..

గతంలో గ్రామాలలో ఎక్కడ చూసినా బీడు భూములు కనపడేవి. గేదలు, ఎద్దులకు మేత కోసం కొంత భూమిని బీడు భూములను ఉంచుకునేవారు. కానీ ప్రస్తుతం కాలం మారింది భూములకు మార్కెట్లో గతంలో కంటే రేట్లు పెరిగిపోయాయి. గ్రామాలలో సైతం రూ. 20లక్షలు, రూ. 30 లక్షల వరకు ఎకరం పొలం ధర పలుకుతోంది. దీంతో రైతులు బీడు భూములను పంట పొలాలుగా మార్చేందుకు సిద్ధపడుతున్నారు. బీడు భూముల్లో ఉన్న చెట్లు, బండలను పొక్లయిన్ ద్వారా తొలగించి, చదును చేస్తున్నారు. ఎక్కడ బీడు భూమి ఉన్నా సారవంతమైన చెరువు మట్టి నింపి పంటపొలంగా మార్చుతున్నారు. గ్రామాలలో రైతులకు చెరువుమట్టి అనుకూలంగా దొరకడంతో బీడు భూములలో నింపుతున్నారు. చెరువుల వద్ద నుంచి దూరాన్ని బట్టి ట్రాక్టర్లకు కిరాయిలను కుదుర్చుకొని మట్టిని తరలిస్తున్నారు. స్తోమతను బట్టి ఎకరానికి 100 నుంచి 300 ట్రక్కుల వరకు తోలుతున్నారు. ఒకసారి పంట పొలంగా మార్చితే భవిష్యత్తులో ఇబ్బంది ఉండదనేది రైతుల ఆలోచన.

చెరువుమట్టి వల్ల ఉపయోగాలు..

- చెరువుమట్టిని పొలాలకు తరలించుకోవడం వల్ల భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వర్షాలు తక్కువగా ఉన్న సమయంలో పంటను త్వరగా వడబడకుండా ఉండేలా చూస్తుంది.
- చెరువుమట్టి తోలిన పొలాల్లో సేంద్రియం పెరిగి రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. దిగుబడులు కూడా పెరుగుతాయి.
- పూడికమట్టి, చెరువుమట్టి వల్ల పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి పంట ఎదుగుదలకు దోహదపడుతుంది.
- భూమి స్వభావాన్ని బట్టి ఎకరానికి 200 ట్రాక్టర్ల వరకు మట్టిని తోలుకుంటే మంచిది.

చౌడు విరుగుతుంది..

చౌడు భూములలో నల్లటి చెరువుమట్టిని నింపడంవల్ల చౌడు విరిగిపోతుంది. ఎకరానికి కనీసం రెండు వందల ట్రాక్టర్ల మేర మట్టితో తోలితే చౌడు విరిగి పంటకు అనుకూలంగా ఉంటుంది. నల్లమట్టిలో తేమశాతం ఎక్కువ ఉండడంవల్ల పంటకు నీటి తడులు కూడా పెద్దగా పెట్టే అవకాశం ఉండదు. చెరువులో ఉన్న ఒండ్రు మట్టి సారవంతం కావడంతో భూమికి బలం పెరుగుతుంది. రైతులు సాధ్యమైనంత వరకు చౌడు, బీడు భూముల్లో చెరువుమట్టి తోలుకుంటే మంచిది.

– వి. రవికుమార్, వ్యవసాయాధికారి

ఘనంగా ఏరువాక పౌర్ణమి



జయంతిలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలలో దంపతులు



అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహిస్తున్న అర్చకుడు

జయంతి(వీరులపాడు): మండలంలోని జయంతి గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కోదండరామాలయంలో పలువురు దంపతులు పీటలపై కూర్చుని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. ఎంపీపీ కోటేరు లక్ష్మీ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి వేడుకలలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి, పంటలతో గ్రామాలు కళకళలాడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఇప్పల శ్రీనివాస్ రెడ్డి, సాదా సాంబిరెడ్డి, ఉమ్మ వెంకట్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి పాల్గొన్నారు.

సత్యమ్మ వారి ఆలయంలో..

నందిగామ: ఏరువాక పౌర్ణమి ఆదివారం నేపథ్యంలో మండలంలోని అంబారుపేట సత్యమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకుడు సుబ్బారావు శర్మ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుంకుమ పూజలు జరిగాయి. అదేవిధంగా పలు గ్రామాలకు చెందిన రైతులు ఈ ఏడాది వ్యవసాయం బాగుండాలని అమ్మవారికి పాల పొంగళ్లు పొంగించారు. అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో కిటకిటలాడింది.



తిరుపతమ్మ ఆలయంలో ఏరువాక పూజలలో పాల్గొన్న చైర్మన్ ఇంజం

తిరుపతమ్మ ఆలయంలో..

పెనుగంచిప్రోలు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు ఆధ్వర్యంలో వేద పండితులు కావిడులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడి పంటలు సంవృద్ధిగా పండి రైతు, రైతుకూలీలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు పాల్గొన్నారు.

తెలుగు వారు గర్వించే గాయకుడు బాలు



ఎస్పీ బాలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: తెలుగు రాష్ట్రాలు గర్వించే గొప్ప గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి వేడుకలు పట్టణంలో ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం కళారాధన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, బాలసుబ్రహ్మణ్యం విగ్రహ వ్యవస్థాపక సంఘం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ గాన గంధర్వుడు బాలసుబ్రహ్మణ్యం మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన ఆలపించిన మధురమైన గీతాలు నేటికీ తెలుగువారి మదిలో నిలిచిపోయాయన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర, ఆర్యవైశ్య సంఘ నాయకులు, కళారాధన సేవాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నామని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నందిగామ: పట్టణ శివారుల్లోని పల్లగిరి కొండపై గల త్రిశక్తి పీఠం వార్షిక ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఆదివారం పీఠంలో కొలువైయున్న కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుంకుమ పూజలు జరిపించారు. అనంతరం దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా సాగింది. అర్చకుడు రాజేష్ శర్మ, వేద పండితుడు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించారు. నందిగామ పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది.

విశ్వనాథం చిల్డ్రన్ పార్కులో మెరుగైన సౌకర్యాలు



పార్కులో సౌకర్యాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఉన్న విశ్వనాథం చిల్డ్రన్ పార్కులో పిల్లలు, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు, ఇంజినీరింగ్ సిబ్బందితో కలసి పరిశీలించారు. పార్కులో పిల్లలు ఆటలు ఆడుకోవడానికి, వాకింగ్ చేసేవారికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు పార్కులో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. అలాగే పార్కులో వాష్ రూమ్స్ నిర్మించడానికి వెంటనే కంట్రాక్టర్‌ను పనులు ప్రారంభించాల్సిందిగా ఆదేశించారు. పార్కుకు వచ్చే వారి తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

ఆదర్శం.. మావ్ లైనాంగ్ నగరం

- కొనసాగుతున్న కార్పొరేటర్ల బృందం పర్యటన
- ఆసియాలో అత్యంత పరిశుభ్రమైన నగరం మావ్ లైనాంగ్
- పారిశుద్ధ్య కార్మికులు ఉండని వైనం



మావ్ లైనాంగ్ నగరంలో కార్పొరేటర్ల బృందం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆసియాలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా గుర్తింపు పొందిన మావ్ లైనాంగ్ నగరంలో అమలు చేస్తున్న సంస్కరణలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ల బృందం పరిశీలించింది. ఈశాన్య రాష్ట్రాల విజ్ఞాన యాత్రలో భాగంగా నాలుగో రోజైన ఆదివారం వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ నేతృత్వంలోని కార్పొరేటర్ల బృందం మావ్ లైనాంగ్ నగరాన్ని సందర్శించింది. 2003లో ఆసియాలో ఏకైక గ్రామంగా, 2005లో ఇండియాలో పరిశుభ్ర గ్రామంగా గుర్తింపు పొందిందన్నారు. ఈ గ్రామం 2017 ఎన్‌పీఆర్ నివేదిక ప్రకారం టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చెంది 60 శాతం ఆదాయ వనరులు పొందుతుందని కార్పొరేటర్ల బృందం గ్రహించింది. మావ్ లైనాంగ్ ఆదర్శ నగరమని చెప్పారు. ఆ నగర విశేషాలు..

బ్యాంబూ బుట్టల ఏర్పాటు..

పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి మనం ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో అదే మాదిరిగా నగరాన్ని కూడా అలాగే శుభ్రం చేసుకుంటారు. నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలనే లక్ష్యంగా అక్కడ నివసించే ప్రతి ఒక్కరూ రోజూ పరిసరాలను, వీధులను శుభ్రం చేసుకుంటున్నారు. అక్కడ పారిశుద్ధ్య కార్మికులు ఎవరూ ఉండరని గుర్తించింది కార్పొరేటర్ల బృందం. చెత్త వేసుకునేందుకుగాను ప్రతి నివాసం, వీధులలో బ్యాంబూ బుట్టలను ఏర్పాటు చేసుకుని చెత్తను వాటిల్లో వేస్తారు. దీంతో సేంద్రియ ఎరువును తయారు చేసుకుని వినియోగించుకుంటున్నారు.

90 శాతం అక్షరాస్యత..

నగరంలో పచ్చదనాన్ని పెంపొందించటంతోపాటు ప్లాస్టిక్ వాడకాన్ని, పొగ తాగటాన్ని నిషేధించారు. ప్రధానంగా అక్కడ ఇంకుడు గుంతల వ్యవస్థను ప్రోత్సహించి అమలు చేస్తున్నారు. నగరంలో 90 శాతం అక్షరాస్యత కలిగి ఒక పంట, వేసవి కాలంలో పైనాపిల్, యాలుకులు ఎగుమతి చేస్తున్నారు. ఇదే విధంగా విజయవాడ నగరంలోని వివిధ డివిజన్లలోని ప్రజలను చైతన్యవంతులను చేయటం ద్వారా మెరుగైన ర్యాంక్ సాధించేందుకు అవకాశం ఉంటుందని ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ అన్నారు.

ఆక్రమణల తొలగింపులో బయటపడ్డ శివలింగం



ఆక్రమణలు తొలగిస్తున్న సమయంలో బయటపడిన శివాలయం

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన కోనేరు వద్ద ఆక్రమణల తొలగింపు కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది. కోనేరుకు ఆగ్నేయ మూల పురాతన శివాలయం ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని ఆక్రమించిన వారికి అనేకమార్లు దేవదాయ శాఖ అధికారులు ఆక్రమణలు స్వయంగా తొలగించుకోవాలని చెప్పినా కూడా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ప్రారంభించిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది. ఆక్రమణలు తొలగిస్తున్న సమయంలో శిథిలావస్థలో ఉన్న పురాతన శివాలయం బయటపడింది. ఆలయంలో పానుమట్టంపై ప్రతిష్ఠించిన శివలింగం ఉంది. పూర్వం నందిగామ ప్రాంత ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోనేరు వద్ద ఉన్న శివలింగానికి నిత్యం పూజలు చేసేవారని, ఇది ఎంతో మహిమాన్వితమైన శివలింగమని పలువురు చెబుతున్నారు. ఇదిలా ఉండగా తవ్వకాలలో పురాతన శివాలయం బయట పడ్డది అన్న సమాచారం తెలుసుకున్న భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఉత్సవ మూర్తులకు మంగళస్నానాలు జరిపిస్తున్న అర్చకుడు



కృష్ణానది నుంచి జలాలను తీసుకువస్తున్న కమిటీ అధ్యక్షులు, భక్తులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం స్వామి వారి ఆలయం నుంచి పలువురు భక్తులు ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు చేరుకున్నారు. దుర్గాఘాట్ నుంచి పవిత్ర కృష్ణాజలాలను కలశాలతో తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపులో ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపల్లి అప్పారావు, బెవర సూర్యనారాయణ, మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు కమిటీ సభ్యులు భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

విశేష పూజలు..

దేవస్థాన ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు మంగళస్నానాలు జరిపించారు. తొలుత పంచామృత అభిషేకాలు, మంగళస్నానాలు అనంతరం స్వామి వారిని పెళ్లి కుమారుడిగా అలంకరించారు. సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. తొలి రోజున ఉత్సవాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనగా, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ల సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, పొట్నూరి దుర్గాప్రసాద్, ఈది ఎల్లారావు, తమ్మిన సూర్యకుమారి, కామందుల నరసింహారావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏఎన్‌యూ పర్యావరణ శాఖ అధిపతి బ్రహ్మాజీ

కృష్ణలంక(విజయవాడ తూర్పు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పర్యావరణ శాఖ అధిపతి బ్రహ్మాజీరావు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక, ఆవారా, విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మాజీరావు మాట్లాడుతూ 1972లో ప్రారంభించిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నేటికి 50 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు పర్యావరణంపై ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

ప్లాస్టిక్ రహిత సంవత్సరం

ప్రతి సంవత్సరం ఒక థీమ్‌ను పర్యావరణ పరిరక్షణ కోసం ప్రారంభిస్తారని, ఈ సంవత్సరం ప్లాస్టిక్ రహిత సంవత్సరంగా ముందుకు తెచ్చారన్నారు. ప్లాస్టిక్ డీ కంపోజ్ కావడానికి 400 సంవత్సరాలు పైనే పడుతుందని, దీనిని నిర్మూలించకపోతే జీవ వైవిధ్యానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని వ్యతిరేకించాలని చెప్పారు మనమే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి తద్వారా భూమి, పర్యావరణాన్ని కాపాడుకుంటామన్నారు. ఎఫ్‌ట్రానిక్స్ అధినేత రామకృష్ణ మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి గ్లోబల్ వార్మింగ్‌పై పెద్ద పోరాటం జరుగుతుందన్నారు. మనతోపాటు చిన్న సంచిని తీసుకెళ్లగలిగితే ప్లాస్టిక్‌ను ఎవరికి వారు నియంత్రించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆవారా వ్యవస్థాపకుడు అజయ్ కాట్రగడ్డ, ఇన్నర్ వీల్ క్లబ్ బాధ్యుడు కవిత, జన విజ్ఞాన వేదిక నాయకుడు శ్రీనివాస్, ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు యూ.వి.రామరాజు, ఐజాక్ న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.